

## దోమ పుట్టొద్దు.. కుట్టొద్దు

- ఖమ్మం జిల్లాలో 30 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాల ఏర్పాటు
- 22వేల ర్యాపిడ్ టెస్ట్ కిట్లు సిద్ధం
- భాగస్వామ్యం కానున్న 1,340మంది సిబ్బంది
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా మలేరియా నియంత్రణ అధికారి వెంకటరమణ

7

ఈ ఏడాది రుతుపవనాలు తొందరగా వచ్చాయి. ఇటీవల వానలు కూడా విస్తారంగా పడటంతో రైతులు దుక్కులు చేసి భూములను సాగుకు సిద్ధం చేశారు. కొందరు రైతులైతే ఏకంగా పత్తి విత్తనాలు వేశారు. కానీ మూడు రోజుల పాటు మురిపించిన వానలు ముఖం చాటేయడంతో విత్తనాలు వేసిన రైతుల్లో గుబులు మొదలైంది. ప్రస్తుతం ఎండలు మండుతుండటం.. వేసిన విత్తు మొలకలు రాకపోవడంతో ఎక్కడ నష్టపోతామోనని ఆందోళన చెందుతున్నారు. ముందుగానే విత్తనాలు వేయొద్దని ఓ వైపు అధికారులు హెచ్చరిస్తున్నా.. కొందరు రైతులు సాగు పనులు ప్రారంభించారు. వారంతా వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.



ఏన్కూరు మండలం రేపల్లెవాడలో మొదట వేసిన పత్తి విత్తనాలు మొలవకపోవడంతో మళ్లీ విత్తనాలు నాటుతున్న కూలీలు

# చినుకు.. చింత

- వానల కోసం రైతుల ఎదురుచూపు
- ఇటీవలి వర్షాలకు విత్తనాలు వేసిన అన్నదాతలు
- మొలకలు రాకపోవడంతో ఆందోళన
- 'కాలం' వచ్చాక పెరిగిన ఎండ, వడగాలులు

ఖమ్మం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వానల కోసం ఉమ్మడి జిల్లా రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది రుతుపవనాలు త్వరాగానే రావడం.. వారం క్రితం వర్షాలు పడటంతో ఈ సారి సాగు సీజన్ ముందుగానే ప్రారంభమవుతుందని అంతా ఆశించారు. కానీ ఇప్పుడు మధ్యాహ్నం ఎండలు.. వడగాల్పులతో పాటు ఉక్కపోతతో ఎండాకాలాన్ని మరిపిస్తుండటంతో దిగాలు చెందుతున్నారు. మేనెలాఖరులో కురిసిన వర్షాలతో చాలామంది రైతులు పలుచోట్ల విత్తనాలు వేశారు. మళ్లీ ఎండలు భగ్గుమని మండుతుండడంతో అవి మొలకెత్తుతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు పత్తి, పిల్లిపెసర, జనుము విత్తనాలు వేయగా.. కొన్నిచోట్ల దుక్కులు వేసి విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉంచారు. ఈ క్రమంలో జిల్లాలో 164మి.మీ సగటు వర్షపాతం నమోదవగా.. ఇప్పటి వరకు వర్షాలు పడకపోవడతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాపరిధిలో ఇప్పటి వరకు పత్తి 3వేల ఎకరాలు, పెసర 100, జనుము 700, జీలుగులు 200 ఎకరాల్లో సాగు చేశారు. వాస్తవానికి మేనెలలో తక్కువ వర్షపాతం పడాల్సి ఉండగా అధిక వర్షపాతం నమోదైంది. జూన్‌లో ఇంకా వర్షాలు పడని పరిస్థితి. ఔట్టవాతావరణంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఖమ్మం జిల్లాలో వానాకాలంలో 5,80,232 ఎకరాలు పంటసాగుకు ప్రణాళిక సిద్ధంచేశారు. ఇందులో వరి 3,04,869 ఎకరాలు మొక్కజొన్న 3453 ఎకరాలు ,పత్తి 2,14,490 ఎకరాలు, వేరుశనగ 950 ఎకరాలు, పెసర 165 ఎకరాలు, పిల్లిపెసర 1952 ఎకరాలు, కంది 652 ఎకరాలు, మిర్చి 53442 ఎకరాలున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వానాకాలం మొత్తం 6,31,124 ఎకరాల సాగు లక్ష్యం కాగా.. వరి 1,60,956ఎకరాలు, మొక్కజొన్న 86,544 ఎకరాలు, పత్తి 2,04,632 ఎకరాలు. వేరుశనగ 2791 ఎకరాలు, మినుము 857 ఎకరాలు, పెసర 131 ఎకరాలు, కంది 1159 ఎకరాలు, మిర్చి 10,449 ఎకరాలకు సాగు లక్ష్యం పెట్టుకున్నారు. ఈ క్రమంలో ముందస్తు వానలతో చాలామంది రైతులు ముఖ్యంగా పత్తి రైతులు విత్తనాలు వేశారు. కానీ వర్షాభావ పరిస్థితులతో సాగు ముందుకు పడలేదు. విత్తనాలు వేసిన వారు వానల కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. కొన్నిచోట్ల మొలకలు వచ్చినా.. వడబడిపోతున్నాయి.



**వర్షం రాకపోతే నష్టం**

భూక్యా భాషా, హిమాంనగర్, ఏన్కూరు మండలం

ఐదెకరాల పొలాన్ని రూ.1.50లక్షలకు కౌలుకు తీసుకుని పత్తి వేశా. 70శాతం విత్తనాలు మొలకొలొచ్చాయి. వర్షాభావంతో మొక్కల్లో ఎదుగుదల లేదు. ఎకరానికి రూ.3వేలు ఖర్చుపెట్టి విత్తనాలు కొన్నా.. కూలీలకు రూ.వెయ్యి ఖర్చయింది. ప్రస్తుతం మళ్లీ రూ.1500లు ఖర్చుపెట్టి విత్తనాలు కొని వేపిస్తున్నాం. ముందస్తు వర్షాలతో మోసపోయాం. ఇప్పుడు కాలం వచ్చినా వర్షాలు కురవడం లేదు.

## కులగణనతో
# దిక్సూచిగా తెలంగాణ

- సమన్యాయం కోసం ప్రజా ప్రభుత్వం కృషి
- సర్దార్ పాపన్నగౌడ్ స్ఫూర్తితో ముందుకు
- ఏడాదిలోపు గౌడ సంక్షేమ భవనం పూర్తి
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొంగులేటి, పొన్నం
- రఘునాథపాలెంలో గౌడ సంక్షేమ భవన్‌కు శంకుస్థాపన



గౌడ సంక్షేమభవన్‌కు శంకుస్థాపన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొంగులేటి, పొన్నం

ఖమ్మం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కులగణన సర్వే నిర్వహించి.. తెలంగాణ రాష్ట్రం కేంద్ర ప్రభుత్వానికి దిక్సూచిగా నిలిచిందని, కేంద్ర ప్రభుత్వం కూడా కులగణనకు నిర్ణయం తీసుకోవడానికి తెలంగాణ రాష్ట్రం చేపట్టిన కులగణనే కారణమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన గౌడ సంక్షేమ కమ్యూనిటీహాల్ భవనానికి వారు సోమవారం శంకుస్థాపన చేశారు. అలాగే సర్దార్ పాపన్నగౌడ్ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో వారు ప్రసగించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశంలో మొదటిసారిగా రాష్ట్రంలో సమన్యాయం కోసం కులగణన చేపట్టి విజయవంతంగా పూర్తిచేశామని, తద్వారా స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్‌కు రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభ, శాసనమండలిలో (మిగతా 6వ పేజీలో)

## పథకాలను ప్రతీ ఇంటికి చేర్చాలి

- రెండు నెలల్లో పదవులన్నీ భర్తీ చేస్తాం
- కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- హస్తం కంచుకోట ఖమ్మం: టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్

6

## 'పాచి'పత్రి

- పారిశుధ్య కార్మికుల సమ్మెతో అధ్వానంగా వార్డులు, పరిసరాలు
- పేరుకుపోయిన చెత్తా చెదారం
- ఇదీ ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధానాస్పత్రి దుస్థితి

చిత్రాలు 6లో...





ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

## భూ వివాదాలు..
# ఇందిరమ్మ ఇళ్లు

- ప్రజావాణి అర్జీల్లో అధికం ఇవే..
- పలు సమస్యలపై కలెక్టర్‌కు అందిన 150 దరఖాస్తులు
- వాటిలో 50 ఇందిరమ్మ ఇళ్ల కోసమే

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలు పరిష్కరించండి.. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించండి.. ఇవీ సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు కలెక్టర్‌కు విన్నవించుకున్న అత్యధిక సమస్యలు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 150 దరఖాస్తులు అందితే వాటిలో అధికంగా 50దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల కోసం రాగా.. రెండో స్థానంలో ప్రజలు తమ భూ సమస్యలను ఏకరువుపెట్టారు. ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చి ప్రజలను అర్జీలు స్వీకరించేందుకు అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోంది. అయినా ప్రజావాణికి భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, డీఆర్వో పద్మశ్రీ, డీఆర్డీవో సన్యాసయ్యతో పాటు జిల్లా అధికారులు డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, ఉపాధికల్పన అధికారి మాధవి, పంచాయతీ అధికారి ఆశాలత, కలెక్టరేట్ ఏవో అరుణ, పర్యవేక్షకులు కారుమంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్‌కు అందిన ఫిర్యాదుల్లో కొన్ని..**

- ఖమ్మం మున్నేరు నదిపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా తమకు చెందిన 14 షాపులను తొలగించారని, వీటి ద్వారా వచ్చే ఆదాయంతో మధ్యాహ్న భోజనం, ఐ బ్యాంక్ లాంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపాలని ఖమ్మం కాల్వ ఒడ్డులోని హిందూ శ్మశాన వాటిక నిర్వహణ కమిటీ వారు కోరారు.
- చింతకాని మండల కేంద్రానికి చెందిన బండి విజయ్‌కుమార్.. తాము కొంత కాలం నుంచి కొండపల్లిలో నివసిస్తున్నామని.. తనకున్న 1.08 గుంటల భూమిని కౌలుకు ఇవ్వగా తమ పొలం పక్కన ఉన్న వ్యక్తి గెట్టు రాళ్ల తొలగించి, సాగునీరు రాకుండా (మిగతా 6వ పేజీలో)

## ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో
# కొనుగోళ్లు షురూ

**26 రోజుల వేసవి సెలవుల తర్వాత మొదలైన క్రయవిక్రయాలు**



ఖమ్మం మార్కెట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సుమారు 26రోజుల వేసవి సెలవుల అనంతరం ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం కొనుగోళ్లు పునఃప్రారంభమయ్యాయి.వేసవి వేడిమి దృష్ట్యా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, కార్మికుల విజ్ఞప్తి మేరకు ప్రతీ ఏడాది లాగానే ఈ ఏడాది కూడా మే నెల 12 నుంచి జూన్ 6 వరకు మార్కెట్‌కు 'వేసవి' సెలవులు ప్రకటించిన విష యం తెలిసిందే. అయితే 7న బక్రీద్ సెలవు, 8న ఆదివారం సాధారణ సెలవు కాగా.. సోమవారం నుంచి క్రయ, విక్రయాలు ప్రారంభమయ్యాయి. కాగా మార్కెట్‌కు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ ఉంచిన ఏసీ మిర్చితో పాటు సాధారణ రకం నాన్ ఏసీ మిర్చి, పత్తి, అపరాలు అమ్మకానికి వచ్చాయి. ఈ క్రమంలో ఏసీ మిర్చి ధర క్వింటా రూ.14,100జెండా పాట ధర పలకగా నాన్ ఏసీ మిర్చి క్వింటా రూ.13,600, పత్తి క్వింటా రూ.6,400, క్వింటా పెసలు రూ. 6,600, కందులు క్వింటా రూ.4,200, క్వింటా మొక్కజొన్న క్వింటా రూ.1,975 పలికాయి. కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఏఎస్ వీరాంజనేయులు, పర్యవేక్షించారు.



హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖను అందజేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## ఆయిల్‌పామ్‌కు
# 'మద్దతు' ఇవ్వండి

- టన్ను ధర కనీసం రూ.25వేలుగా నిర్ణయించాలి
- దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునః సమీక్షించాలి
- హార్టికల్చర్ యూనివర్సిటీకి నిధులు మంజూరు చేయాలి
- కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి తుమ్మల వినతి

అశ్వారావుపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ గెలలు టన్ను ఒక్కంటికి రూ.25వేలు కనీస మద్దతు ధరగా నిర్ణయించాలని కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఆయిల్‌పామ్ దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని పున: సమీక్షించాలన్నారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు తెలంగాణా ఆయిల్ పామ్ పార్మర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్‌తో కలిసి మంత్రి తుమ్మల లేఖను అందించారు. ఈ సందర్భంగా పామాయిల్, కొబ్బరి రైతులకు సంబంధించిన పలు సమస్యలను మంత్రి తుమ్మల కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్‌పామ్ (ఎన్ఎంఈఓ-ఓపి)కింద తెలంగాణ రాష్ట్రం 1,25,000 హెక్టార్ల విస్తరణ లక్ష్యంగా పెట్టుకొని ఇప్పటి వరకు 75వేల హెక్టార్లలో పామాయిల్‌ను విస్తరించి దేశంలో మొదటిస్థానంలో ఉందని వివరించారు. పామాయిల్ గెలల ధర టన్ను రూ.25వేలు కనీస మద్దతు ధర ఇవ్వాలని, మేలైన విత్తనాల సరఫరా కోసం విదేశాలనుంచి విత్తన సరఫరాదారులను కేంద్రం గుర్తించి ఎంప్యానల్ చేయాలన్నారు. దేశీయ నూనె ఉత్పత్తులను ప్రోత్సాహించేందుకు 27.5శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని 40శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని, దీనికి భిన్నంగా పదిశాతం దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయం పామాయిల్ విస్తరణపై ప్రభావం చూపుతుందన్నారు.

భద్రాద్రి కొత్తగూడెంలో కొబ్బరి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల కోరారు. తెలంగాణాలో ప్రస్తుతం 3,300 ఎకరాల్లో కొబ్బరి సాగులో ఉందని, అందులో భద్రాద్రి జిల్లాలో 1,757 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 696 ఎకరాల్లో విస్తరించి ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాదులో ఉన్న కొబ్బరి బోర్డు కార్యాలయం రాష్ట్ర విభజన అనంతరం విజయవాడకు తరలిపోయిందని, దీని ప్రాంతీయ కార్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేయాలని కోరారు. అశ్వారావుపేట, దమ్మపేటలలో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా కొబ్బరి విస్తరణ మరింత వేగంగా జరిగే అవకాశాలున్నాయన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీకి రూ.100కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర పునర్విభజన చట్టం-13 షెడ్యూల్‌లో తెలంగాణ రాష్ట్రానికి ఉద్యాన యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్రం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. దీనికోసం రూ.1823.20 కోట్ల బడ్జెట్‌తో ప్రాజెక్టు రిపోర్టును సమర్పించినట్లు తెలిపారు. అయితే దీనికి ఇప్పటి వరకు కేవలం రూ.135కోట్లు మాత్రమే నిధులు విడుదలయ్యాయని, పూర్తిస్థాయిలో విద్యా, పరిశోధన, విస్తరణ సేవలు అందించేందుకు మిగతా నిధులను అత్యవసరంగా విడుదల చేయాలని కోరారు. ఆత్మనిర్భల్ భారత్ లక్ష్య సాధనకు పైన తెలిపిన ఐదు అంశాలు అత్యంత కీలకమని, వ్యవసాయ రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో అవసరమని మంత్రి తుమ్మల కేంద్ర మంత్రికి విన్నవించారు.

## హరిత వేతనం కోసం
# 'వనజీవి' సతీమణి వినతి

6



కలెక్టర్‌ను కలిసి వస్తున్న వనజీవి రామయ్య భార్య జానమ్మ

# మున్నేరు ముంచెత్తినా.. ధీమాగా ఉండేలా..

- నగర పాలక సంస్థ కమిషనర్ ప్రత్యేక కార్యాచరణ
- పైలెట్ ప్రాజెక్టులుగా 46, 47, 48 డివిజన్ల ఎంపిక
- ఇళ్ల నుంచి చిన్న పరికరాల వరకు బీమా సౌకర్యం
- ప్రధాన కంపెనీలతో కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్యాచరణ
- నేడు పరివాహక ప్రాంతంలో బీమాపై అవగాహన సదస్సు

7



గతేడాది సెప్టెంబరులో మున్నేరు ఉగ్రరూపం

వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య (ఫైల్)

## నేడు భద్రాద్రిలో జ్యేష్ఠాభిషేకానికి
# అంకురార్పణ

- రెండ్రోజుల పాటు ఉత్సవం
- రేపు నిత్య కల్యాణం నిలిపివేత

భద్రాచలం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో జ్యేష్ఠాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి మంగళవారం సాయంత్రం.. పవిత్ర గోదావరి నుంచి తీర్థబిందెతో నీటిని తీసుకొచ్చి యాగశాల వద్ద ఉత్సవానికి అంకురార్పణ చేయనున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే జ్యేష్ఠాభిషేకంలో పాల్గొనే వైదిక సిబ్బందికి ఆలయ అధికారులు దీక్షా వస్త్రాలను అందజేస్తారు. ఈ ఉత్సవంలో భాగంగా బుధవారం 81 కలశాలతో స్వామి వారికి అభిషేకం (స్నపనం) నిర్వహించనున్నారు. ఇక జ్యేష్ఠాభిషేకాన్ని పురస్కరించుకుని బుధవారం రామయ్య నిత్యకల్యాణ వేడుకను నిలిపేయనున్నారు.





# 'పాచి'పత్రి

- పారిశుధ్య కార్మికుల సమ్మెతో అధ్వానంగా వార్డులు, పరిసరాలు
- ఇదీ ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి దుస్థితి

ఈ చిత్రాలు చూస్తుంటే కడుపు దేవేస్తోంది కదూ.. చూస్తుంటేనే అలా ఉందంటే.. ఇక అక్కడి వారి పరిస్థితేంటో ఆలోచించండి. పేరుకు పోయిన చెత్త కుప్పలు.. కంపు కొడుతున్న పరిసరాలున్నవి ఎక్కడో కాదు.. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో. నాలుగు నెలలుగా తమకు వేతనాలివ్వడం లేదంటూ పారిశుధ్య కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. నిత్యం వందలాది మంది రోగులు, వారి సహాయకులు వచ్చే ఈ ఆస్పత్రిలోని వార్డులు, పరిసరాల్లో చెత్త, వ్యర్థాల నిల్వలు పేరుకుపోతున్నాయి. రోజుల తరబడి తొలగించపోవడంతో కంపుకొడుతోంది. ముక్కుపుటాలదిరే వాసన, ముసురుతున్న ఈగలు, చుట్టుముడుతున్న బొద్దింకలతో ఇటు సేవలందించే వైద్యులు, సిబ్బంది.. అటు రోగులు ఎన్నో అవస్థలు పడుతున్నారు.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



## దేవస్థానం భూముల్లో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న పాలకమండలి, సిబ్బంది



అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న దేవస్థానం సిబ్బంది

భద్రాచలం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ఐటీడీఏ రోడ్‌లో ఉన్న రాజీవ్‌నగర్ కాలనీలో సోమవారం కుసుమ హరినాథ్ బాబా దేవస్థానం భూముల్లో అక్రమ నిర్మాణాన్ని పాలకమండలి, సిబ్బంది అడ్డుకున్నారు. దేవస్థానానికి సర్వేనెంబర్ 91/1లో 3.57 ఎకరాల పట్టాభూమి ఉండగా అందులో అక్రమ నిర్మాణం చేపడుతున్నట్లు అమకు సమాచారం అందిందని దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ క్రమంలో సోమవారం అక్రమంగా ఇంటి నిర్మాణం కోసం సెంట్రింగ్ ఏర్పాటుచేయగా పాలకమండలి చైర్మన్ శ్రీనివాస్, సభ్యులు తంబాలక్ష్మార్జునరావు, సీత, కార్యనిర్వాణాధికారి జి.సుదర్శన్ సిబ్బంది అక్కడికి చేరుకుని వాటిని తొలగించారు.

# విపత్తులను సమన్వయంతో ఎదుర్కోవాలి

- కలెక్టరేట్‌లో 1077 టోల్ ఫ్రీ నెంబర్
- మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో వర్షాలపై నిరంతర పర్యవేక్షణ
- విపత్తుల నిర్వహణపై ఎస్డీఆర్ఎఫ్, పోలీస్ అధికారులతో కలెక్టర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):సమన్వయంతో పనిచేసి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశం మందిరంలో విపత్తుల నిర్వహణపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఎస్డీఆర్ఎఫ్, పోలీస్ అధికారులతో సమీక్షించారు. గత సంవత్సరం వచ్చిన భారీ వరద, తీసుకున్న చర్యలు, తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడూరాని విధంగా గతేడాది భారీ స్థాయిలో వరద వచ్చిందని తెలిపారు. 2023లో 24 అడుగుల వరద అతి పెద్దది అనుకుంటే 2024లో 40 అడుగుల వరద వచ్చిందన్నారు. ఆ సమయంలో సామాజిక మాధ్యమాల్లో చాలా మేరకు తప్పుడు ప్రచారాలు జరిగాయని అన్నారు. ఖమ్మం జిల్లాలో వరద ఉధృతి అధికంగా ఉండటం, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో లేకపోవడం, ప్రజలు ముందుగా వరద ఉధృతి ఊహించకపోవడం వంటి అనేక కారణాల వల్ల చాలా ఇబ్బందులకు గురి అయ్యామని కలెక్టర్ తెలిపారు. ఇవి పునరావృతం కాకుండా జిల్లాలో వరద పరిస్థితులపై అప్రమత్తంగా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో కురిసే వర్షం వివరాలను కూడా ట్రాక్ చేస్తు, మున్నేరు, ఇతర నదుల ప్రవాహాల వివరాలను వాట్సాప్ గ్రూపుల ద్వారా జిల్లా అధికారులకు ఎప్పటికప్పుడు అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 1077 నెంబర్ ఏర్పాటు చేశామన్నారు. 380 మంది సామాన్య ప్రజలకు శిక్షణ అందించి ఆపద మిత్రలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామ స్థాయిలో ఆపద మిత్రలు, పంచాయతీ కార్యదర్శి, విద్యుత్, నీటి పారుదల శాఖ, ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ టీచర్లతో డిజాస్టర్ టీం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. విపత్తు సమయంలో వినియోగించే పరికరాలు ముందుగా వాడి మనకు అలవాటు చేసుకోవాలని అన్నారు. ఎస్డీఆర్ఎఫ్. బృందం సభ్యులు ఖమ్మం జిల్లాలో గతంలో అధికంగా వచ్చిన వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కొత్తగూడెం 6వ బెటాలియన్ అధికారి డి.శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 98 మంది వరకు రాష్ట్రస్థాయిలో విపత్తు నిర్వహణ పట్ల శిక్షణ పొందారని, వీరికి అవసరమైన పరికరాలపై జాబితా అందిస్తామని అన్నారు. విపత్తు సమయంలో వచ్చి అవసరమైన సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ, ఎస్డీఆర్ఎఫ్ బృందం అసిస్టెంట్ కమాండెంట్ డి.శ్రీనివాస్‌రావు, ఆర్ఎస్ఐ శ్రీవాస్తవ్, శ్రీకాంత్, సురేష్, ఆర్ఐ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

### భద్రాద్రి జిల్లాలో 22 పీఎంశ్రీ పాఠశాలలకు
# నిధుల విడుదల



కొత్తగూడెం అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో విద్యార్థులు సమకాలీన అంశాలపై పట్టు సాధించేందుకు సామాజిక స్పృహను పెంపొందించేందుకు విద్యాశాఖ చర్యలకు ఉపక్రమించింది. పాఠశాలస్థాయి నుంచి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచేందుకు దోహదపడే దిన, వార, మాస పత్రికల కొనుగోలుకు నిధులు కేటాయించింది. పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలలకు ప్రత్యేక బడ్జెట్‌ను విడుదల చేసింది. కేంద్రం తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూలకు సంబంధించిన మూడు చొప్పున బాలల వార, మాస పత్రికలను కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీచేసింది. ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం కింద కేంద్ర ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు విద్యార్థుల్లో విజ్ఞానం పెంచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో 2025-26 విద్యాసంవత్సరానికి ప్రతి పాఠశాలకు రూ.10 వేల చొప్పున స్కూల్స్ ప్రారంభానికి ముందుగానే నిధులు విడుదల చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో నిధులను విడుదల చేసినప్పటికీ ప్రధానోపాధ్యాయులు కొందరు పాఠశాలలకు పత్రికలు, మ్యాగజైన్లు తెప్పించలేదన్న విమర్శలు బాహాటంగానే వినిపించాయి. విద్యార్థుల ప్రయోజనార్థం ఈ సారైనా నిధులను సద్వినియోగం చేసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

**ప్రతి పాఠశాలకు రూ. 10వేలు..**

భద్రాద్రి జిల్లాలో 22పీఎంశ్రీ పాఠశాలలు ఉండగా.. వార్తా పత్రికలు, మ్యాగజైన్ల కోసం ప్రతి పాఠశాలకు రూ.10వేల చొప్పున కేంద్రప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను విడుదల చేసింది. ఇందులో పది నెలల కాలానికి తెలుగు, హిందీ లేదా ఉర్దూ దినపత్రికలకు రూ.250 చొప్పున మొత్తం రూ.5000 ఆంగ్ల పత్రిక కోసం రూ.200 చొప్పున మొత్తం రూ.2000, వార, మాస బాలల మ్యాగజైన్స్ కోసం రూ.100 చొప్పున రూ.3000 కేటాయించారు.

**అన్ని పాఠశాలలకు వర్తింపజేయాలి..: రమేష్ రాథోడ్**

పత్రికలు, మ్యాగజైన్ల పఠనం కేవలం పీఎంశ్రీ పాఠశాలలకే పరిమితం చేయకుండా అన్ని పాఠశాలలకు విస్తరించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. నిధులు సక్రమంగా వినియోగిస్తే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది. పేద పిల్లలకు పత్రిక కథనాలను చదవడంతో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడటంతో పాటు సమాజం పట్ల అవగాహన ఏర్పడుతుంది.

**సద్వినియోగం చేసుకోవాలి యం.వెంకటేశ్వర చారి (డీఈవో)**

విద్యార్థులు పాఠ్యపుస్తకాలు చదువుతుండటంతో విషయ పరిజ్ఞానం పెరిగితే.. పత్రికలను చదివడంతో లోకజ్ఞానం వృద్ధి చెందుతుంది. సమకాలీన అంశాలను తెలుసుకునే అవకాశంతో పాటు బయట ప్రపంచంతోపాటు మన చుట్టూ ఉన్న సమాజంలో ఏం జరుగుతుందో పిల్లలు సులువుగా తెలుసుకుంటారు.

# చౌక దుకాణాల వద్ద లబ్ధిదారుల నిరీక్షణ

- బియ్యం పంపిణీలో సాంకేతిక సమస్యలు
- 3 నెలల బియ్యాన్ని పొందేందుకు తప్పని తిప్పలు




జూలూరుపాడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని పొందేందుకు లబ్ధిదారులు చౌకదుకాణాల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. బియ్యం పంపిణీలో సాంకేతిక సమస్యలు తలెత్తి మిషన్ పని చేయకుండా మొరాయిస్తోంది. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 24 పంచాయతీల పరిధిలో 18 చౌకదుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 11,500 మందికి ఆహార భద్రతా కార్డులు ఉన్నాయి. కార్డులో పేర్లు నమోదైన వారికి ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున 3 నెలలకు కలిపి 18 కిలోల బియ్యాన్ని పంపిణీ చేస్తుండగా ఒక్కొక్కరు మూడు సార్లు వేలిముద్రలను వేయాల్సివస్తుంది. ఒక్కొక్క కార్డుదారుడు వేలిముద్రలు వేయటానికి 15 నుంచి 20 నిమిషాల సమయం పడుతుందని డీలర్లు అంటున్నారు. రోజుకి 20మందికి మించి బియ్యాన్ని పంపిణీ చేయలేకపోతున్నామని డీలర్లు చెబుతున్నారు. గతంలో 10 రోజుల్లో బియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తయ్యేదని, 3 నెలల బియ్యంతో నెలరోజులైనా పంపిణీ పూర్తయ్యే పరిస్థితి లేదని డీలర్లు చెబుతుండటం గమనర్హం. ఇప్పటికైన బియ్యం పంపిణీలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టి లబ్దిదారులకు బియ్యాన్ని అందించాలని కోరుతున్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

- 4వ తరగతిలో చేరికలకు అవకాశం
- 7నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

ఖమ్మం స్పోర్ట్స్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో 2025-26 సంవత్సరానికి గాను 4వ తరగతిలో ప్రవేశాలకు బాలురు, బాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో భాగంగా ఈనెల 16 నుంచి 19 వరకు మండల స్థాయిలో 25, 26 తేదీలలో జిల్లా స్థాయిలో, జూలై 1 నుంచి 5 వరకు రాష్ట్ర స్థాయిలో ఎంపికలు ఉంటాయని ఆయన తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే విద్యార్థులు 01-09-2016 నుంచి 30-8-2017 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో ఈనెల 7 నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం సర్దార్ పటేల్ స్టేడియం కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని కోరారు.

### ఖమ్మం మార్కెట్‌లోకి
# ఆల్ట్రోజ్ కొత్త మోడల్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే ప్రజాదారణ పొందిన ఆల్ట్రోజ్ కారును కొత్త మోడల్‌లో ప్యాసింజర్ విభాగంలోకి ఆదునికతను జోడించి విడుదల చేయటం రవాణా రంగంలో మంచి మార్పు వంటిదని వీవీసీ మోటార్స్ ఎండీ వంకయాలపాటి రాజేంద్రప్రసాద్(రాజా) పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం మార్కెట్‌లోకి అల్ట్రోజ్ నూతన మోడల్‌ను విడుదల చేశారు. వాహనం ప్రత్యేకతలను వివరించారు.




కారును ప్రారంభిస్తున్న ఏసీపీ రమణమూర్తి, వీవీసీ మోటార్స్ ఎండీ వంకాయలపాటి రాజా



ప్రసంగిస్తున్న మహేష్‌కుమార్ గౌడ్

# పథకాలను ప్రతీ ఇంటికి చేర్చాలి

- రెండు నెలల్లో పదవులన్నీ భర్తీ చేస్తాం
- కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని, ఆయా పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను పార్టీ కార్యకర్తలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. రఘునాథపాలెం మండలంలో సోమవారం గౌడసంఘ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన పీసీసీ చీఫ్ మహేష్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి కాంగ్రెస్ ఖమ్మం జిల్లా కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. కుటుంబంలోని ప్రతీ ఒక్కరికి అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ల లేకపోతుండటంతో.. పదేళ్లు దోచుకుని తిన్న వాళ్లు ప్రజా ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. గతంలో కూడా ఇంతకు మించిన నిధులు ఉన్నాయనీ, కానీ వారు సంక్షేమ పథకాలను మాత్రం అమలు చేయలేదన్నారు. అడ్డంగా దోచుకొని ఆ డబ్బులను ఉపయోగించి సోషల్ మీడియా, యూట్యూబ్ చానళ్ల ద్వారా దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఏడాదిన్నర కాలంలో ఏ ప్రభుత్వం చేయని సంక్షేమం ఇందిరమ్మ ప్రభుత్వం చేసిందన్నారు. రాష్ట్రంలో కోటి కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ, 80శాతం మందికి ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, యంగ్ఇండియా పాఠశాలలు, డైట్ చార్జీలు పెంపు, టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన, ఏడాదిలో 56వేల ఉద్యోగాల కల్పన ఇలా ఎన్నో చేస్తున్నామన్నారు. కొద్ది రోజుల్లోనే నామినేటెడ్, ఇతర పదవులను భర్తీ చేస్తామన్నారు. పదేహేనేళ్లుగా పార్టీ కోసం నిలబడి పోరాడిన వారి జాబితా తయారు చేస్తున్నామని, పార్టీ కోసం కష్టపడ్డ అందరికీ న్యాయం చేస్తామన్నారు.

**నియంతృత్వ పోకడలకు ఎదురొడ్డిన ఖమ్మం: మహేష్‌కుమార్ గౌడ్**



కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు నియంతృత్వ పోకడలకు ఎదురొడ్డి పోరాడిన జిల్లాల్లో ఖమ్మం ముందు వరుసలో ఉందని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పార్టీకి ఖమ్మం కోటగా నిలిచిందని, దానికి తగ్గట్టుగానే పార్టీ కూడా ఎక్కువమందికి పదవులు ఇచ్చి గౌరవించిందన్నారు. గత పాలకులు మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని పదేళ్లలో ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. ఒకటి రెండు నెలల్లో కార్పొరేషన్లలో మిగిలి ఉన్న డైరెక్టర్, చైర్మన్ల పదవులను భర్తీ చేస్తామని, కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. శాస్త్రీయంగా కుల గణన నిర్వహించడం ద్వారా దేశానికి రోల్‌మోడల్‌గా రాష్ట్రాన్ని నిలిపామని, ఎస్సీ, బీసీ, దళిత బిడ్డలకు పదవులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని అన్నారు.

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ 90 సీట్లతో మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వంలో ప్రతీ కార్యకర్త భాగస్వామ్యమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానిక ఎన్నికల్లో గెలవడానికి ప్రతీ కార్యకర్త కృషిచేయాలన్నారు. కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## భూ వివాదాలు.. ఇందిరమ్మ ఇళ్లు!

(5వ పేజీ తరువాయి)

పంట కాలువను పూడ్చేసారని తమకు న్యాయం చేయాలని పిర్యాదు చేశారు.

● నగరంలోని 15వ డివిజన్‌లో లకారం చెరువు అలుగు వాగును ఆక్రమించుకుని దారి మళ్లించారని ఫలితంగా ఆగస్టులో వచ్చే వరదలకు బఫర్ జోన్‌లో ఇబ్బందులు పడుతున్నామంటూ పువ్వాళ్ల నాగేశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● తల్లాడ మండలం మిట్టపల్లి లో రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి, ఇళ్ల స్థలాలను అక్రమించుకుని కొందరు వ్యవసాయం చేసుకుంటున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలంటూ దమ్మాలపాటి నాగేశ్వరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● సత్తుపల్లి మండలం కిష్టాపురం సర్వే నెంబర్ 140/అ/అ/1లో 3.30 ఎకరాల భూమిని ఆక్రమించుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఈ విషయమై తహసీల్దార్, సర్వేయర్ల వద్దకు తిరిగుతున్నామని కానీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన వల్లభనేని లక్ష్మి ఫిర్యాదు చేశారు.

● ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన తాము కరోనా సమయం నుంచి స్వీపర్‌గా పని చేస్తున్నానని, తనను నేడు విధుల నుంచి తొలగించారని, ఉపాధి కల్పించాలని పగడం దేవకర్మ కలెక్టర్‌ను వేడుకున్నారు.

**హరిత వేతనం కోసం 'వనజీవి' సతీమణి వినతి**

తన భర్తకు ఇచ్చిన రూ.50వేల హరిత వేతనాన్ని తనకు వచ్చేలా కొనసాగించాలంటూ ఇటీవల కన్నుమూసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి దరిపల్లి రామయ్య సతీమణి జానమ్మ సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌కు విన్నవించుకున్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వెళ్లిన వనజీవి రామయ్య భార్య జానమ్మ.. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిశారు. తన భర్త ఇటీవల మరణించాడని, దాంతో తన జీవితం కకావికలమైందని, ఆసరా కరువైందని, ఆయనకు ఇప్పటి వరకు ప్రభుత్వం ఇచ్చిన హరిత వేతనాన్ని తనకు వచ్చేలా కొనసాగించాలని వేడుకున్నారు. ఆమె వినతిపై స్పందించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించామన్నారు. కలెక్టరేట్ ఎదుట వనజీవి రామయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉందని, ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ ఆమెకు భరోసా కల్పించారు.

# కులగణనతో దిక్సూచిగా తెలంగాణ

(5వ పేజీ తరువాయి)

తీర్మానంచేసి కేంద్రానికి పంపిందని గుర్తుచేశారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు సమాజంలో వెనుకబడిన వర్గాలకు సమన్యాయం కల్పించడాన్ని ప్రభుత్వం బాధ్యతగా తీసుకుందన్నారు. 1702లో సర్వాయి పాపన్న వీరోచిత పోరాటం చేసి అనేక రాజ్యాలను సొంతం చేసుకుని రాజుగా పరిపాలించాడని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. రఘునాథపాలెంలో నిర్మించే గౌడ సంక్షేమ కమ్యూనిటీ హాల్‌ను ఏడాదిలోపు పూర్తిచేస్తామని ఇక్కడే కోచింగ్ సెంటర్, విద్యార్థులకు హాస్టల్ సదుపాయాలు కల్పించడంతో పాటు పాపన్నగౌడ్ విగ్రహాన్ని కూడా ఆవిష్కరిస్తామన్నారు.

**ఇతర కులాలను, మతాలనూ గౌరవించాలి : పీసీసీ చీఫ్ మహేష్**

సమాజంలో ప్రతీ ఒక్కరు తాము పుట్టిన కులాన్ని, మతాన్ని ప్రేమిస్తూనే ఇతర కులాలను, మతాలను గౌరవించడం మంచి సంప్రదాయమని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టి బీసీలకు సమన్యాయం కల్పించేందుకు 42శాతం రిజర్వేషన్ కల్పించిందని వివరించారు. ప్రతి ఒక్కరు కులవృత్తులను గౌరవిస్తూ కొనసాగించాలని, పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సమన్యాయం దక్కుతుందని, రాష్ట్రంలో ఖమ్మంజిల్లా కాంగ్రెస్‌కు కంచుకోట అని, ఇక్కడ మెజారిటీ సీట్లు గెలవడం ద్వారానే కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగిందన్నారు. ఈ జిల్లా నుంచే ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులుగా తుమ్మలనాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి బాధ్యతలు చేపట్టగలిగారని, ఖమ్మంజిల్లా రాజకీయ చైతన్యానికి మారుపేరని, ఇక్కడ నిర్మించే గౌడ సంక్షేమభవన్, విద్యార్థుల హాస్టల్ భవన నిర్మాణానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. కులాల వారికి సంక్షేమభవన్‌లు ఏర్పాటుచేసి వివాహాలు, ఇతర కార్యక్రమాలకు ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ఈ ప్రభుత్వం సమాజంలోని అన్ని కులాలను గౌరవిస్తూ.. సముచిత న్యాయం చేస్తోందన్నారు. ఖమ్మంలో నిర్మించే గౌడ సంక్షేమభవన్‌ను ఏడాదిలోపు పూర్తిచేసేందుకు మంత్రులుగా తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఇప్పటికే పలు దేవాలయాల్లో సత్రాలు, కాటేజీలు, పలునగరాల్లో విద్యార్థులకు హాస్టల్‌భవనాలు నిర్మించామని, ఇంకా కొన్ని కొత్తగా నిర్మిస్తున్నామని తెలిపారు. కులవృత్తిని నమ్ముకుని రాష్ట్రంలో ఎన్నో గౌడ కుటుంబాలు జీవిస్తున్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గౌడన్నలు తాటి చెట్లు ఎక్కేందుకు రక్షణగా అవసరమైన పరికరాలు అందించామన్నారు. కులగణన ద్వారా రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన కులాలకు సామాజిక న్యాయం జరుగుతుందని, గౌడలు అన్నిరంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈసభలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర హస్తకళా అభివృద్ధి సంస్థచైర్మన్ నాయుడు సత్యనారాయణ, గౌడసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోత్ రాందాస్‌నాయక్, తదితరులు ప్రసంగించారు. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ ఖమ్మం అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్‌గౌడ్, న్యాయవాది తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ మాట.. అంగన్‌వాడీ బడిబాట


- నేడు అంగన్‌వాడీ కేంద్రాల పునఃప్రారంభం

ఖమ్మం ఖానాపురం హవేలీ / కొత్తగూడెం అర్బన్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టిసారించింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను కొత్త విద్యాసంవత్సరంలో అమలు చేయనుంది. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రవేశాలు పెంపునకు చర్యలు చేపట్టారు. ఇటీవల బడిబాటలో భాగంగా చాలామంది చిన్నారులకు ప్రవేశాలు కల్పించారు. మిగిలిన వారిని చేర్పేందుకు మంగళవారం నుంచి జిల్లాలో 'అమ్మ మాట..అంగన్ వాడీ బాట' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం పునఃప్రారంభించనుండగా.. అమ్మమాట.. అంగన్‌వాడి బడిబాట కార్యక్రమంలో భాగంగా ఏడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు.

**కార్యక్రమాలు ఇలా..**

మంగళవారం ఉదయం ప్రీ స్కూల్ పిల్లల తల్లితండ్రులను, ప్రజా ప్రతినిధులను, ప్రీ స్కూల్ పాఠశాల కమిటీ సభ్యులను అంగన్‌వాడీ కేంద్రాలకు ఆహ్వానిస్తారు. తొలుత అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రపరిచి.. మామిడి తోరణాలతో అలంకరిస్తారు. బుధవారం మూడేళ్ల పిల్లలను గుర్తించి వారి ఇళ్ల సందర్శన, అనంతరం ప్రీ స్కూల్ సిలబస్, టైంటేబుల్, వర్క్‌బుక్స్ స్టోరీ బుక్స్, ప్రీ స్కూల్ కిట్ మెటీరియల్ తదితర అంశాల గురించి తల్లితండ్రులకు వివరిస్తారు. ప్రీ స్కూల్ విద్య పూర్తైన పిల్లలకు సర్టిఫికెట్ల పంపిణీ (గ్రాడ్యుయేషన్‌డే)ను నిర్వహించారు. ఇందులో ప్రతీ ప్రాథమిక పాఠశాలలో ఐదుగురికి తగ్గకుండా నమోదు చేయాల్సి ఉంటుంది.

# దోమ పుట్టొద్దు.. కుట్టొద్దు



- ఖమ్మం జిల్లాలో 30 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాల ఏర్పాటు
- 22వేల ర్యాపిడ్ టెస్ట్ కిట్లు సిద్ధం
- భాగస్వామ్యం కానున్న 1,340మంది సిబ్బంది
- 82 హైరిస్క్ ప్రాంతాల గుర్తింపు
- టీహబ్‌లో డెంగీ పరీక్షలు నిర్వహించాలి
- 'ఆంధ్రజ్యోతి'తో జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ వెంకటరమణ



ఖమ్మం కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో దోమల నివారణకు నిర్మాణాత్మక చర్యలు చేపడుతున్నామని, ప్రజలు కూడా ఇంటి పరిసరాల శుభ్రతతోపాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడితే మెరుగైన ఫలితాలు వస్తాయని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. దోమల నివారణ కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన వివరించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా ముందస్తు జాగ్రత్తలు పడితేనే ప్రజలు ఈ సీజన్‌లో అనారోగ్యం బారిన పడకుండా కాపాడుకునే ఆస్కారం ఉందన్నారు.

## ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు సిద్ధం

దోమల నివారణకు శాఖాపరంగా చర్యలు చేపడుతున్నామని డాక్టర్ వెంకటరమణ తెలిపారు. మురుగుకాలువల్లో, నీళ్లు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడ దోమలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వా వంటివి చల్లడం, రాత్రి వేళల్లో ఫాగింగ్ చేస్తున్నామన్నారు. మునిసిపాలిటీల్లో కొన్ని ప్రత్యేక ప్రాంతాలను ఇప్పటికే గుర్తించి అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ప్రజలు కూడా తమవంతు కృషి చేయాలని కోరారు. జిల్లాలో అన్ని పీహెచ్‌సీల పరిధిలో 30 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఆయా మెడికల్ ఆఫీసర్లుగా ఏర్పాటు చేశామని తెలిపారు. అక్కడ పంచాయతీరాజ్, విద్యాశాఖ లాంటి కొన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, వీటిని పర్యవేక్షించడానికి మరో 12 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

## 22 వేల ర్యాపిడ్ కిట్లు సిద్ధం

జూన్ నెలలో దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ వెంకటరమణ తెలిపారు. 'దోమలు పుట్టకుండా కుట్టకుండా' అనే నినాదంతో ముందస్తుగా చర్యలు చేపట్టామన్నారు. వర్షాకాలంలో దోమల వల్ల తలెత్తే పరిస్థితులు, వ్యాప్తి చెందే వ్యాధులపై అవగాహన కల్పిస్తామన్నార. శాఖాపరంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూనే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నామని, ప్రధానంగా జిల్లా వ్యాప్తంగా 1,340 ఆశా కార్యకర్తలు, మెడికల్ సిబ్బందిని ఇందులో భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. ఇళ్లల్లో ఉండే నీటి కుండ, సంపు, డ్రమ్ము, ఓవర్ హెడ్ ట్యాంకుల్లోని నీటిని వారానికోసారి తొలగించి పదినిమిషాలు ఎండలో ఆరబెట్టి, తర్వాత నీటిని నింపాలన్నారు. ఇలా చేస్తే దోమల గుడ్లు, లార్వాలు, ప్యూపాలు పూర్తిగా నశించిపోతాయని, తద్వారా దోమలు పుట్టకుండా ఉంటుయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 22వేల ర్యాపిడ్ కిట్లను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అన్ని పీహెచ్‌సీల్లో 200 నుంచి 500 వరకు అందుబాటులో ఉంచామని, రక్తనమూనాలు కూడా సేకరించి టీహబ్ లో ఫలితాలను వెల్లడించనున్నట్లు తెలిపారు. డెంగీ పరీక్షలు (ఎలీజా) పరీక్షలు కూడా కేవలం టీహబ్‌లోనే నిర్వహించాలని, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎలాంటి డెంగీ పరీక్షలు నిర్వహించొద్దని, వాటి ఫలితాలను వెల్లడించొద్దని తెలిపారు.

### 82 హైరిస్క్ ప్రాంతాల గుర్తింపు

ఖమ్మం జిల్లాలో 1,409 గ్రామల్లో గత అనుభవాల నేపథ్యంలో 82 హైరిస్క్ ప్రాంతాలను గుర్తించినట్లు డాక్టర్ వెంకటరమణ వివరించారు. అక్కడ గత ఏడాది 33వేల రక్త పరీక్షలు నిర్వహించి, ఆయా గ్రామాల్లో ముందస్తుగానే అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇక రెసిడెన్సియల్ పాఠశాలల్లో ఏసీఎం ( అల్ఫాసైక్రో మైత్రిన్) పావుకిలోకు 10 లీటర్ల నీటిలో కలిపి గోడలు, చూర్లు, 5 అడుగుల పైభాగంలో ఈ ద్రావణాన్ని పిచికారి చేయిస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో దోమలు పుట్టకుండా నిరోధించనున్నట్లు తెలిపారు. మునిసిపాలిటీల్లోనూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అన్ని డివిజన్లు, వార్డుల్లోనూ దోమల నివారణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# 'గూడెం'లో సీపీఐ శ్రేణుల సంబురాలు

- ఎమ్మెల్యే కూనంనేనిపై అనర్హత పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు
- పట్టణంలో బైకు ర్యాలీ.. బాణసంచా పేల్చిన కార్యకర్తలు



రుద్రంపూర్‌లో బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకొంటున్న సీపీఐ నాయకులు

కొత్తగూడెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుపై ప్రత్యర్థి ప్రోద్బలంతో ఓ వ్యక్తి వేసిన అనర్హత పిటిషన్‌ను ఏడాదిన్నర నిరీక్షణ అనంతరం తెలంగాణ హైకోర్టు సోమవారం డిస్మిస్ చేసింది. అనర్హత పిటిషన్ డిస్మిస్ కావడంతో నియోకవర్గంలో సీపీఐ శ్రేణులు సంబురాలు జరుపుకొన్నాయి. సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ నుంచి ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటరులో బాణసంచా పేల్చి తమ ఆనందాన్ని చాటుకున్నారు. ర్యాలీ సందర్భంగా సెంటర్లలో జరిగిన సభల్లో నాయకులు మాట్లాడుతూ దొడ్డిదారిని అందలం ఎక్కుదామనుకున్న ప్రత్యర్థులకు కోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టులాంటిదని, ఇది ప్రజల గెలుపు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, తోట రాజు, మునిగడప వెంకటేశ్వర్లు, గెద్దాడ నగేష్, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

పిటిషన్ డిస్మిస్ చేసిన వార్త తెలియగానే కొత్తగూడెం కోర్టులో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ నాయకులు, బార్ అసోసియేషన్ కార్యదర్శి బాగం మాదవరావు, కోటరాజు, మునిగడప వెంకటేశ్వర్లు, ఉప్పుశెట్టి సునీల్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో 20 నుంచి పద్య నాటకోత్సవాలు

ఖమ్మం సాంస్కృతికం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు గేయరచయిత చందాల కేశవదాసు జయంతి సందర్భంగా ఈనెల 20, లేదా 21వ తేదీనుంచి మూడు రోజుల పాటు ఖమ్మంలో పద్య నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా నాటక సమాఖ్య నాయకులు పుతుంబాక కృష్ణప్రసాద్, నిభానపూడి సుబ్బరాజు, కొండపల్లి జగన్మోహన్, ముల్లంగి గాబ్రియోల్ వనం అప్పాజీ, రామారావు, ఖాదర్‌బాబా, సులేమాన్ తెలిపారు. ఆదివారం రాత్రి ఖమ్మంలో జరిగిన సమాఖ్య సమావేశంలో జిల్లా సాహిత్యరంగ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి విస్తృతంగా చర్చించారు. జిల్లాకు చెందిన తొలి తెలుగు గేయరచయిత , దాస త్రయంలో ఒకరైన చందాల కేశవదాసుకు మరింత ప్రాచుర్యం కల్పించటంతోపాటు ఆయన జయంతి సందర్భంగా పద్యనాటకాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి వనం అప్పాజీ కార్యక్రమాన్ని ప్రార్థనా గీతంతో ప్రారంభించగా సంగీత విద్వాంసుడు బొప్పన జయరాజు సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. రాష్ట్ర సమాఖ్య సూచనలను వివరించి అంశాలపై చర్చించారు.

# సీతారామ జలాల్లో భద్రాదికి ద్రోహం

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన



బీఆర్ఎస్ నాయకుల బైక్ ర్యాలీ

ఇల్లెందు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు జలాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ రైతుల భూములకు అందకుండా సాగుతున్న కుట్రలను ప్రతిఘటించాలని, ఏజెన్సీ జిల్లాకు సాగునీరు లభించేవరకు పోరాడాలని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం సీతారామ జలాలను భద్రాది జిల్లా భూములను అందించాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయలని డిమాండ్ చేస్తు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఇల్లెందులో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలోని భూములకు సాగు నీరు ఇవ్వకుండా జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ద్రోహం చేశారని అన్నారు. నాగర్జున సాగర్, ఆయకట్టు స్థిరీకరణ జరిగిన ప్రాంతాలకు సీతారామ జలాలను తరలించుకుపోవడం దుర్మార్గమని విమర్శించారు. జల దోపిడీని అడ్డుకునేందుకు జిల్లాకు రైతులు పార్టీలకు అతీతంగా పోరాటలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళనలో బీఆర్ఎస్ నాయకులు దేవిలాల్‌నాయక్, భూక్య సురేష్, జబ్బార్, శీలం రమేష్, మల్సార్, మూడు కృష్ణ ప్రసాద్, రంగనాథ్, సిలివేరు సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. అంతకు ముందు పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, రైతులు ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు.

## భార్యపై భర్త దాడి

చింతకాని, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ప్రశ్నించిన భార్యపై దాడికి పాల్పడిన భర్త గుండెబోయిన రమేష్‌పై సోమవారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పొద్దుటూరు గ్రామానికి చెందిన గుండెబోయిన రమేష్‌కు 13 ఏళ్ల క్రితం క్రితం నందినితో వివాహమైంది. గత కొంత కాలంగా మద్యానికి బానివ్వడంతో పాటు వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని భార్య నందిని ప్రశ్నించడంతో ఆమెపై రమేష్ కర్రతో దాడి చేశాడు. నందిని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

## భూ తగదాలో ముగ్గురిపై కేసు

కారేపల్లి, జూన్9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగలితండాలో తేజవత్ మోహన్‌లాల్, ఎర్రనాగుల హూస్సేల మధ్య గట్టు పంచాయతీ ఉంది. ఇదే విషయంపై సోమవారం గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించారు. ఈ క్రమంలో గొడవపడిన ఇరువర్గాలకు చెందినవారు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామంలోకి వెళ్లి విచారణ చేపట్టారు. ముగ్గురుపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

# ప్రభుత్వ బడులను సందర్శించిన విద్యా కమిషన్ చైర్మన్

- పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు పర్యటించిన ఆకునూరి మురళి
- సాధ్యాసాధ్యాలపై గ్రామస్థుల అభిప్రాయాల సేకరణ



విద్యా కమిషన్ చైర్మన్‌కు విద్యారంగ సమస్యలు తెలుపుతున్న పీఆర్టీయూ నాయకులు

మధిరరూరల్, జూన్9 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలోని మహదేవపురం, సిరిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సోమవారం తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సందర్శించారు. మధిర మండలంలో మూడు పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటుచేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో వాటి విధివిధానాలు సాధ్యాసాధ్యాలపై చర్చించేందుకు మధిర మండలం పర్యటనకు వచ్చారు. మహదేవపురం, సిరిపురం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థుల అభిప్రాయం తీసుకున్నారు. ఈసందర్భంగా సిరిపురం గ్రామంలో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆకునూరి మురళిని కలిసి విద్యారంగ సమస్యలను వివరించారు. కొత్త పాఠశాలల ఏర్పాటుతో ఉన్న పాఠశాలలు బలహీనమయ్యేలా విద్యాసంస్కరణలు ఉంకూడదని పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలే సుధాకర్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా, ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యారంగ వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి వాటిపై విద్యావేత్తలు, మేధావులు, ఉపాధ్యాయ సంఘ నాయకులతో చర్చించి ప్రభుత్వ విద్యారంగ బలోపేతమే లక్ష్యంగా విద్యాసంస్కరణలు తీసుకొస్తే స్వాగతిస్తామని పీఆర్టీయూ నాయకులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డీఈవో సామినేని సత్యనారాయణ, ఎంఈవో ప్రభాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి దుర్మరణం



సోనాలి(ఫైల్)

పెనుబల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మహిళా పంచాయతీ కార్యదర్శి మృతిచెందిన సంఘటన జాతీయ రహదారిలో వీఎంబంజర్ వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కల్లూరు మండలం లక్ష్మాతండా గ్రామానికి చెందిన బాణోతు సోనాలి(33) ఇంటి నుంచి మండలంలోని రామచంద్రర్‌రావు బంజర్‌లోని రెవెన్యూ గ్రామసభకు హాజరయ్యేందుకు స్కూటీపై వెళుతున్నారు. ఈ క్రమంలో వీఎం బంజర్ ప్రాథమిక పాఠశాల వద్ద అడ్డుగా వచ్చిన గేదెను తప్పించే ప్రయత్నంలో రోడ్డుపై పడిపోగా వెనుక నుంచి వచ్చిన లారీ ఆమెపైనుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆమె అవయవాలన్నీ నుజ్జునుజ్జు కావడంతో మృతిచెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులున్నారు. ఆమె మృతి పట్ల సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ సంతాపం తెలిపారు.

# మున్నేరు ముంచెత్తినా.. ధీమాగా ఉండేలా..

- నగర పాలక సంస్థ కమిషనర్ ప్రత్యేక కార్యాచరణ
- నేడు పరివాహక ప్రాంతంలో బీమాపై అవగాహన సదస్సు



మున్నేరు వరద ముంపునకు గురైన బొక్కలగడ్డ ప్రాంతం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మున్నేరు పరివాహక ప్రాంతంలోని ముంపు ప్రాంతాల ప్రజలు ఆకస్మికంగా వరద ముంచెత్తినా.. ఎంతో ధీమాగా ఉండేలా ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్యాచరణ చేశారు. గతేడాది సెప్టెంబరు 1న మున్నేరుకు వచ్చిన వరదలో నివాసాల్లో ఉన్న వందలాది ద్విచక్ర వాహనాలు, కాల్వొడ్డు గ్యారేజీలో ఉన్న కార్లు పదుల సంఖ్యలో మున్నేరు పరివాహకంలో కొట్టుకుపోయాయి. కొన్ని వాహనాలు మాత్రం నీటిలో కొట్టుకుపోయి కొంత దూరం వెళ్లిన తర్వాత మున్నేరు వాగుకు పక్కకు మేట వేశాయి. వాహనాలతో పాటుగా 16, 17, 28, 29, 30, 34, 35,46, 47, 48, 59, 60 డివిజన్లలోని నివాసాలు, నివాసాల్లోని దుస్తులు, బంగారం, వెండి, ఫర్నీచర్, బియ్యం, ఉప్పు, పప్పు సహా సర్వం మున్నేరు వరదలో కొట్టుకుపోయాయి. అయితే గత మున్నేరు విపత్తును దృష్టిలో పెట్టుకొని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆస్తి నష్ట నివారణ చర్యలను తగ్గించేందుకు ఉపక్రమించారు. మున్నేరు బాధితుల జాబితాలను ఇన్సూరెన్స్ జాబితాలను ఆయా బ్యాంకుల ద్వారా తెప్పించుకొని పరిశీలించగా వాటిలో పూర్తిస్థాయిలో బీమాపై అవగాహన ఉన్న ముంపు బాధితులు తిరిగి బీమా సౌకర్యం ద్వారా కొంత మేర నష్టాన్ని తగ్గించుకున్నారు. బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, మోతీనగర్, జుబ్లీపుర, సారథినగర్, పద్మావతినగర్ వంటి భారీగా ముంపుకు గురైన ప్రాంతాలు, మురికివాడల ప్రజలకు మాత్రం బీమా అందలేదు. ఎందుకంటే వారు నివాసాలకు ఇంట్లోని విద్యుత్, ఫర్నిచర్, వాహనాలకు ముందస్తుగా బీమా చేయించుకొలేదు. మున్నేరు ముంపు తర్వాత కూడా వారి ధ్రువపత్రాలు ముంపులో కొట్టుకుపోవటంతో బీమా సౌకర్యం అందలేదు.

### నేడు మూడు డివిజన్లలో అవగాహన

గతేడాది మున్నేరు ముంపులో భారీగా నష్టం వాటిల్లిన 46, 47, 48 డివిజన్లను కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు బీమా సౌకర్యంపై మంగళవారం అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలైన ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఇతర ప్రైవేట్ కంపెనీలు అవగాహన సదస్సులో పాల్గొంటున్నాయి. ముంపు ప్రాంతాల్లోని చిరు వ్యాపారాలకు, ఇళ్లు, ఫర్నీచర్, ఇంట్లోని విద్యుత్ పరికరాలు, ఇతర వస్తువులు, సామగ్రి, ద్విచక్ర వాహనాల నుంచి భారీ వాహనాల వరకు పశువులు, జంతువులకు ఇలా బీమాకు అవకాశం ఉన్న అంశాలను ప్రజలకు వివరిస్తారు. బీమాకు కావాల్సిన దస్త్రాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా వర్తింపు జరిగేలా బీమా మేళాను ఏర్పాటు చేశారు. నయాబజార్ కాలేజీ మైదానంలో అవగాహన సభను ఏర్పాటు చేశారు. 46, 47, 48 డివిజన్లలో వచ్చిన ప్రజాభిప్రాయం మేరకు ఇతర ముంపు డివిజన్లలో బీమా మేళాను ఏర్పాటు చేయనున్నారు.

# అసోం లారీ డ్రైవర్ హత్య

- ఇనుప రాడ్‌తో కొట్టిన ఒడిసా డ్రైవర్
- మధిర మండలం నిదానపురంలో ఘటన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న మధిర సీఐ మధు

మధిర రూరల్, జూన్9 (ఆంధ్రజ్యోతి): అసోం రాష్ట్రానికి చెందిన ఓ లారీ డ్రైవర్‌ను అదే చోట పనిచేసే మరో లారీ డ్రైవర్ ఇనుపరాడ్డుతో కొట్టి హత్య చేసిన సంఘటన సోమవారం మధిర మండలం నిదానపురం క్రాస్‌రోడ్డులో జరిగింది. మధిరరూరల్ ఎస్ఐ లక్ష్మీభార్గవి తెలిపిన వివరాల ప్రకారం.. మధిర మండలం నిదానపురం క్రాస్‌రోడ్డు వద్ద ఒక కన్‌స్ట్రక్షన్ కంపెనీవారు హైవే రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇక్కడ వాహనాల్లో పనిచేసేందుకు అసోం, ఒడిసా రాష్ట్రాలకు చెందిన లారీ డ్రైవర్లు వచ్చారు. ఇద్దరు లారీడ్రైవర్‌ల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణ జరిగింది. ఈఘర్షణలో శిభ అనే ఒడిసా రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ అసోం రాష్ట్రానికి చెందిన సుమన్(40) పాండ్యా అనే లారీడ్రైవర్‌ను ఇనుపరాడ్‌తో బలంగా కొట్టాడు. దీంతో సుమన్ పాండ్యా అక్కడికక్కడే మృతిచెందాడు. నిందితుడు పరారయ్యాడు. వెంటనే రంగంలోకి దిగిన రూరల్ పోలీసులు సోమవారం నిందితుడిని పట్టుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మధిర సీఐ మధు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

## 80 మందికి జరిమానా

కొత్తగూడెం లీగల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి పట్టుబడిన 80 మందికి కొత్తగూడెం కోర్టులో జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు సోమవారం తీర్పు చెప్పారు. కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్ఐ తుంగ రాకేష్, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ కే. నరేష్, టూటౌన్ ఎస్‌హెచ్‌వో ప్రతాప్, కొత్తగూడెం త్రీటౌన్ ఎస్ఐ పురుషోత్తం , లక్ష్మీదేవిపల్లి ఎస్‌హెచ్‌వో జి. రమణారెడ్డి, సుజాతనగర్ మండల పరిధిలో ఎస్‌హెచ్‌వో రమాదేవి తమ బృందాలతో వాహన తనిఖీ చేయగా పట్టుబడిన వారిని కోర్టులో ప్రవేశ పెట్టారు. వారంతా నేరం అంగీకరించి జరిమానా చెల్లించారు.

## రోగి మృతిపై ప్రైవేటు ఆస్పత్రిలో విచారణ



విచారణ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి

చుంచుపల్లి, జూన్9(ఆంధ్రజ్యోతి): చుంచుపల్లి మండలంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన రోగి మృతి వివాదాస్పదం అవగా ఆ సంఘటనపై డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్ ఆదేశాలనుసారం స్వయంగా పరిశీలించేందుకు పీఎం బ్రదర్స్ ప్రైవేటు ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీ బృందం సుమోటోగా విచారణ నిర్వహించడానికి ఆస్పత్రిని సందర్శించి వైద్యులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాన్ని, ప్రభుత్వ నియమ నిబంధనలు పాటిస్తున్న వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి సంబంధిత వైద్య నివేదికను సిద్ధం చేసి వివరణాత్మకంగా డీఎంహెచ్‌వోకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో వైద్యాధికారులు మధువరుణ్, డిప్యూటీ డెమో ఫైజ్ మోహినుద్దీన్, సీహెచ్‌వో సోమ్లానాయక్‌ఉన్నారు.

## బావిలోకి దూసుకెళ్లిన వాహనం

అశ్వాపురం, జూన్9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అశ్వాపురం శివారు ప్రధాన రహదారి పక్కన ఉన్న వ్యవసాయ బావిలోకి సోమవారం ప్రమాదవశాత్తూ ఎరువుల లోడ్‌తో వెళుతున్న ట్రాలీ వాహనం దూసుకెళ్లింది. ఈసంఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎరువుల లోడ్‌తో ట్రాలీ వాహనం మణుగూరు నుంచి చర్ల వెళుతోంది. మార్గమధ్యంలో అశ్వాపురం శివారులో వాహనం అదుపుతప్పి ప్రధాన రహదారిపక్కన ఉన్న వ్యవసాయబావిలోకి దూసుకెళ్లింది. బావిలో నీరు తక్కువగా ఉండటంతో అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. 108వాహన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని స్వల్ప గాయాలపాలైన వారికి ప్రథమచికిత్స అందించారు. ఎస్ఐ మధుప్రసాద్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

# కిరాతకంగా చంపేశారు..

- భద్రాద్రి హత్య ఘటనపై కుటుంబసభ్యులు, ఆదివాసీ నాయకులు

భద్రాచలం, జూన్ 9 ( ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో శనివారం పట్టపగలు కణితి సతీష్‌ను కిరాతకంగా చంపేశారని కుటుంబసభ్యులు, ఆదివాసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం భద్రాచలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మృతుడి వదిన సౌజన్య, ఆదివాసీ నాయకులు పాయం సత్యనారాయణ, తెల్లం నరేష్ మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలకు, ప్రాణాలకు రక్షణ లేదనే విషయం మరోసారి సతీష్ హత్యతో స్పష్టమైందన్నారు. మృతుడి వదిన సౌజన్య మాట్లాడుతూ తన మరిది సతీష్ చిరునామ చెప్పమని అతడి మిత్రుడిని తీవ్రంగా కొట్టారన్నారు. సుమారు 30 మంది వచ్చి మారణాయుధాలతో తన మరిదిపై దాడి చేశారని అన్నారు. తన భర్తను చంపబోతుంటే తానే అడ్డుకున్నట్లు సౌజన్య తెలిపారు. మొత్తం 30 మంది ఘటనలో పాల్గొన్నా ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక కీలక నేతతో పాటు మరొకరు ఉన్నారని ఆమె తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేద్దామని వెళ్లిన తమకు, దాడిలో పాల్గొన్నవారు అక్కడే ఉండటం తమను ఎంతగానే బాధించిందని అన్నారు. ఈ ఘటనపై డీజీపీ, ఎస్టీ కమిషన్, మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ విషయంలో బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించి ఉరి వేయాలని వారు డిమాండ్ చేశారు.

## బీసీ రిజర్వేషన్ సదస్సును జయప్రదం చేయండి

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్9(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో నేడు జరిగే బీసీ రిజర్వేషన్ సదస్సును జయప్రదం చేయాలని వివిధ బీసీ సంఘాల నాయకులు కోరారు. సోమవారం ఖమ్మం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బహుజన సంఘం నాయకులు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా బీసీ సమాజం ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. నేడు జరిగే సదస్సుకు బహుజన ప్రజానీకం అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈవిలేకరుల సమవేశంలో పాల్వంచ రామారావు, పసుపులేటి నాసరయ్య, రావుల హనుమంతరావు, లింగనబోయిన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ అకాడమీలపై నిఘా వర్గాల ఆరా

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఖమ్మం ఖానాపురం హవేలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కేంద్రంలో ఇబ్బడి ముబ్బడిగా పుట్టుకొస్తున్న మెడికల్ అకాడమీలపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. శనివారం 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో శనివారం 'పుట్టగొడుల్లా పుట్టుకొస్తున్నాయ్' శీర్షికన నగరంలో వివిధ పేర్లతో వెలుస్తున్న మెడికల్ అకాడమీల గురించి ప్రచురితమైంది. దీనికి స్పందించిన నిఘా వర్గాలు ఆమేరకు ఆరా తీస్తున్నాయని సమాచారం. మరో రెండు మూడు రోజులలో మెడికల్ అకాడమీలకు అనుమతులు ఉన్నాయా లేవా అనే విషయాలు బైటకురానున్నాయి.

## దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్ చైర్స్ పంపిణీ



ట్రైసైకిళ్లను అందిస్తున్న రాయల నాగేశ్వరరావు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూన్ 9(ఆంధ్రజ్యోతి): చేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగులకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ట్రైసైకిళ్లు, వీల్ చైర్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల ఆత్మవిశ్వాసం పెంచేందుకు వారిని స్వావలంబంగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి సహాయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సామాజికంగా బాధ్యత కలిగిన సంస్థల నుంచి ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అనిల్‌కుమార్, రంగారావు, సీతారామయ్య, నవీన్, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు జరిపాం

» ఏఎంసీ చైర్మన్ సీతారాములు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సీతారాములు

నేలకొండపల్లి, జూన్9(ఆంధ్రజ్యోతి): ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేశామని ఏఎంసీ చైర్మన్ సీతారాములు అన్నారు. సోమవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో కార్యదర్శి అజ్మీరా పంతులు అధ్యక్షతన జరిగిన డైరెక్టర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు రైతులు పంటలు వేయాలని కోరారు. తొలుత ఆదాయ, వ్యయాల నివేదికను కార్యదర్శి చదివి వినిపించారు. డైరెక్టర్లు చిట్టూరి అచ్చయ్య, సూరేపల్లి రవి, మాలోతుసైదా, తిప్పని సరోజిని, చాట్ల సత్యనారాయణ, మీసానాగేశ్వరరావు, ఎంపీడీవో ఎర్రయ్య, మండల వ్యవసాయాధికారి యం.రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పిడమర్తి రవి, సోమచంద్రశేఖర్ తదితరులు

ఖమ్మంచర్చికాంపౌండ్, జూన్9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కేబినేట్‌లో మాదిగ, మాల, ముదిరాజ్ సామాజిక వర్గానికి స్థానం కలిపించినందుకు గాను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పిడమర్తి రవి, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు ఖమ్మంనగరంలోని జడ్పీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 40లక్షలపైగా ఉన్న మాదిగల చిరకాల వాంఛ అయిన వర్గీకరణను పూర్తిచేసి, మాదిగలకు మంత్రి పదవి కేటాయించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సోమచంద్రశేఖర్ మాట్లాడుతూ జనాబా దామాషా ప్రకారం రాష్ట్రంలోనూ, ఖమ్మం జిల్లాలోను చట్టసభల్లో నామినేటెడ్ పదవుల్లో, పార్టీ పదవుల్లో మాదిగలకు పదవులు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్, వేల్పుల మురళి, కస్తాల క్రాంతికుమార్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

తిరుమలాయపాలెం, జూన్9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో మృతి చెందిన పలు మృతుల కుటుంబాల సభ్యులకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందించిన రూ.10వేల నగదును సోమవారం మంత్రి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. పిండిప్రోలు, పాపాయిగూడెం, వెదుళ్లచెరువు, తెట్టెలపాడు, తిప్పారెడ్డిగూడెం, పాతర్లపాడు, బీరోలు, జూపెడ, మేడిదపల్లి, కాకరవాయి గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబాల సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10వేలు అందించారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బెల్లం శ్రీను, ఉన్నం రాజశేఖర్, తాటికొండ కిరణ్, లింగయ్య, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న దయాకర్‌రెడ్డి

# పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన

» మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా ఇందిరమ్మ ప్రభుత్వ పాలన మన రాష్ట్రంలో కొనసాగుతుందని రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మద్దులపల్లిలోని రూ.94 లక్షలతో ఖమ్మం-సూర్యాపేట అర్అండ్‌బీ రోడ్డు నుంచి ఆటోనగర్-పోన్నేకల్లు డొంక వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పోలేపల్లి గ్రామంలో పోలేపల్లి నుంచి రాజీవ్ గృహకల్ప కాలనీ ఎన్ ఎస్‌కెనాల్ లాకల్ వరకు రూ.2 కోట్ల 86 లక్షలతో నిర్మించనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తెల్దారుపల్లిలో ఎస్సీ నివాస ప్రాంతంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న 11 అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.50 లక్షలతో అంతర్గత సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామన్నారు. వీటిని 10 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో తెల్దారుపల్లి గ్రామంలో రూ.81 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించామన్నారు. ముత్యాలమ్మగుడి నుంచి దోబీఘాట్ వరకు, ఖమ్మం నుండి కోదాడ తెల్దారుపల్లి నుంచి రాముడి చెరువు, తెల్దారుపల్లి నుంచి తల్లంపాడు వరకు రూ.10 కోట్ల, 50 లక్షలతో 4 రోడ్లు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదల కోసం గతంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తు ఆర్థిక పరిస్థితిని బాగు చేస్తూ నూతనంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం సరఫరా, సన్న వడ్లకు క్వింటాళ్ల 500 బోనస్, రైతు భరోసా 12 వేల రూపాయలకు పెంపు, 21 వేల కోట్ల రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్ల వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామాలలో గత పాలకులు విస్మరించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను కూడా పూర్తి చేస్తున్నామని అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే బాధ్యత ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకుంటుందని పేదలకు అండగా ఉండే ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాథబాబు, ఆర్డీవో నరసింహరావు, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రాంప్రసాద్, నాయకులు తమ్మినేని నవీన్, బండి జగదీష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## డీవైఎఫ్ఐ పోరాటం అభినందనీయం: ఎస్ఐ

వైరా, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతను చైతన్యం చేస్తూ జిల్లా వ్యాప్తంగా డీవైఎఫ్ఐ చేపట్టిన యువచైతన్య యాత్ర అభినందనీయమని వైరా ఎస్ఐ పి.రామారావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి వైరాలో నిర్వహించిన డీవైఎఫ్ఐ యువచైతన్య సైకిల్ యాత్రకు ఎస్ఐ సంఘీభావం తెలిపి ప్రసంగించారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా జిల్లావ్యాప్తంగా డీవైఎఫ్ఐ చేస్తున్న సైకిల్ యాత్రను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు చాలామంది యువత బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో వాటికి వ్యతిరేకంగా డీవైఎఫ్ఐ చేస్తున్న సైకిల్ యాత్ర బృందాన్ని ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, డీవైఎఫ్ఐ నాయకులు షేక్. బషీరుద్దీన్, షేక్.నాగూల్‌పాషా, మద్దాల ప్రభాకర్, చింతల రమేష్, శీలం వీరబాబు, సత్తెనపల్లి నరేష్, గుమ్మా ముత్తారావు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సాహిత్యంపై ఆంగ్ల ప్రభావం

» కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయ ఆంగ్ల విభాగ సీనియర్ ప్రొఫెసర్ తిరుపతిరావు




ప్రసంగిస్తున్న తిరుపతిరావు

ఖమ్మం సాంస్కృతికం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంపై ఆంగ్ల సాహిత్య ప్రభావం ఎంతగానో ఉందని కుప్పం ద్రవిడ యూనివర్సిటీ ఆంగ్ల విభాగ సీనాయర్ ప్రొఫెసర్, ప్రముఖ సాహితీవేత్త బి. తిరుపతి రావు అన్నారు. సోమవారం ఖమ్మంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల తెలుగు, ఇంగ్లీష్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన తెలుగు సాహిత్యంపై ఆంగ్ల సాహిత్య ప్రభావం అనే సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనేక సాహిత్య రూపాలు ఆంగ్ల భాషనుంచి దిగుమతి అయ్యాయని సోదాహరణగా వివరించారు. తెలుగు నవలలు ఆంగ్ల ప్రభావంతోనే మొదలయ్యాయని వివరించారు. నాటకం కూడా అదే తరహాలో ఆంగ్లం నుంచి ప్రేరణ పొందామన్నారు. నాగరికత అభివృద్ధికి స్థానిక భాషాసాహిత్యం, సంస్కృతులు ఎంతగానో ఆసరాగా నిలిచాయన్నారు. వలస వాదం వల్ల ఇంగ్లీష్ మనలను ఎంతగానో ప్రభావితం చేసిందన్నారు. ఆకారణంగా ఆంగ్ల సాహిత్య రూపాలను అనుకరించడం జరిగిందన్నారు. భాష ఏదైనా మనిషిని మహనీయుడిని చేసేది సాహిత్యం మాత్రమే అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భానోత్ రెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. సునంద, ఇంగ్లీష్ విభాగ అధిపతి డాక్టర్ ఏ.నర్సమ్మ, డాక్టర్ ఎం. రాంబాబు, కె. రవికుమార్, డి. బంగరి, తెలుగు సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ సీతారాం, డాక్టర్ జే. అనూరాధ, కోటమ్మ, కిరణ్‌చ రమణ, సరిత, శివాజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సత్వరం స్పందించాలి

» కేఎంసీ ప్రజావాణిలో వినతులు స్వీకరించిన ఏసీఎల్‌పీ శ్రీజ



డ్రైయినేజీ సమస్యపై ఫిర్యాదు చేస్తున్న పదవీ విరమణ పొందిన ఎస్ఈ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సంబంధిత అధికారులు వెంటనే పరిష్కారం చూపాలని అసిస్టెంట్ కలెక్టర్ స్థానిక సంస్థలు శ్రీజ ఆదేశించారు. ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. మామిళ్లగూడెం ప్రాంతానికి చెందిన ఓ పదవీ విరమణ పొందిన సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ భార్యతో వచ్చి తన ఇంటి ముందుకు డ్రైనేజీ సమస్యను వివరించారు. 8నెలలుగా సమస్య చెప్పినా ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవటం లేదని తన సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. అలాగే 60వ డివిజన్‌లో పైప్ లైన్ లేకపోవడంతో రామన్నపేట ప్రాంతంలో తాగునీటి ఎద్దడి ఏర్పడిందని అధికారులు తాగునీటి పైప్‌లైన్ నిర్మాణం చేయాలని మాజీ కార్పొరేటర్ వినతిపత్రం అందించారు. ప్రకాశ్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ దరఖాస్తదారుడు తన ఇంటి పన్ను అధికంగా వస్తుందని ఫిర్యాదు చేశారు. ప్రతి సంవత్సరం పంపు పన్నులు చెల్లిస్తున్నా బకాయిలు వస్తున్నాయని రాపర్తినగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. తదితర సమస్యలపై ప్రజలు తమ వినతులు అందించారు. ఈఈ కృష్ణలాల్, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుందర, మేనేజరు బుచ్చిబాబు, ఏవో శ్రీనివాస రెడ్డి, పారిశుధ్య పర్యవేక్షకులు సాంబయ్య, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులకు ఘన స్వాగతం

ఖమ్మం రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెంలోని గౌడ కమ్యూనిటీ భవనం శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాకు విచ్చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌లకు జిల్లా గౌడ సంఘం నేతలు మండలంలోని మద్దులపల్లి స్టేజి వద్ద సోమవారం ఘన స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు గజమాలతో సత్కరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూగోపా, జిల్లా నాయకులు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అమరగాని వెంకటేశ్వర్లు, కేశగాని రాజశేఖర్ పాల్గొన్నారు.

## 108లో మహిళ ప్రసవం



మగ శిశువుతో 108 సిబ్బంది

నేలకొండపల్లి, జూన్9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పలనర్సింహాపురం గ్రామానికి చెందిన నిండు గర్భిణిగా ఉన్న మేఘనకు సోమవారం ఉదయం నొప్పులు ప్రారంభం కావడంతో బోనకల్‌కు చెందిన 108 అంబులెన్సులో ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా, పురుటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది ప్రసవం చేశారు. మగ శిశువుకు జన్మనిచ్చినట్లు ఈఎంటీ మనోహర్ చెప్పారు. తల్లీ, బిడ్డ ఇరువురు క్షేమంగా ఉన్నారని, శిశువుకు జన్మనిచ్చిన అనంతరం చికిత్సకోసం ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఈఎంటీ మనోహర్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

» సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న కస్తాల సత్యనారాయణ

ఖమ్మం ఖానాపురం హవేలీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, అందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల. సత్యనారాయణ అన్నారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా నగరంలోని వేణుగోపాల్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. బడి వయస్సు కలిగిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాలలో అందించే గుణాత్మక విద్యను విద్యార్థులు పొందాలన్నారు. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. పాఠశాలకు కావాల్సిన సహాయసహకారాలు అందించేందుకు పలువురు ముందుకొచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పోరేటర్ శ్రావణి సుధాకర్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతీరాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది. వెంకటేశ్వర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎగ్జామినేషన్ కంట్రోలర్‌ను తొలగించాలి: పీడీఎస్‌యూ




ధర్నా చేస్తున్న నాయకులు

ఖమ్మం ఖానాపురం హవేలీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పరీక్ష ఫీజు రిసిప్ట్ ఇవ్వటానికి వచ్చిన పలువురు విద్యార్థులను అసభ్యకరంగా మాట్లాడిన ఎగ్జామినేషన్ కంట్రోలర్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని సోమవారం పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశా రు. నగరంలోని ఎస్ఆర్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఎగ్జామినేషన్ కార్యాలయం ముందు పీడీఎస్‌యూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ కళాశాలలో మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ పరీక్షలు రాయబోతున్న కొందరు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించి ఫీజు రశీదును ఇవ్వటానికి వెళ్లిన విద్యార్థులపై ఎగ్జామ్ కంట్రోలర్ అసభ్యంగా మాట్లాడారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న శివరామకృష్ణ

## పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

తిరుమలాయపాలెం, జూన్9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లచెరువు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సోమవారం ఇళ్ల పట్టాలను ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ పంపిణీ చేశారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, ఏఎంసీ డైరెక్టర్ జడల నగేష్, కాంగ్రెస్ నాయకులు ఉన్నం రాజశేఖర్, తాటికొండ కిరణ్, ఎం.నాగేశ్వరరావు, రంగ, ఉపేందర్, పూర్ణచంద్రరావుతదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారం కోసం సదస్సులు




రాజారంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం, జూన్9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం ప్రవేశపెట్టిందని దీనిని సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ లూథర్ విల్సన్ తెలిపారు. సోమవారం మండలంలోని రాజారం, పిండిప్రోలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రాజారంలో 45, పిండిప్రోలులో 75 మంది రైతులు పలు సమస్యలపై దరఖాస్తు చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాలలో రైతులకు భూమికి సంబంధించిన ఏదైనా సమస్యలుంటే రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో డీటీ జి.సుధీర్, ఆర్ఐలు లక్ష్మణ్, వీరయ్య, సిబ్బంది జ్యోత్స్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుడు రామకృష్ణ ఆశయాలు సాధించాలి

ఖమ్మం ఖానాపురం హవేలీ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మాజీ సైనికుడు యలగందుల రామకృష్ణ మే 15న మృతి చెందగా ఆయన సంస్మరణను సభ ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలో డీపీఆర్సీ భవన్‌లో ఏనుకూరు గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 1962లో చైనా యుద్ధంలో, 1970లో పాకిస్తాన్ యుద్ధంలో సైనికుడిగా సేవలందించాడని, శరీరంలో బుల్లెట్లు ఉన్నప్పటికీ సైనిక బాధ్యతల అనంతరం ఏనుకూరు గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గా నియమితులైనారని అన్నారు. అప్పటికే ఆ పాఠశాల భవనం పురాతన ఎస్ఎస్సీ క్వార్టర్స్ కావడంతో కొంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ అతి కొద్ది కాలంలోనే అత్యుత్తమ గురుకుల పాఠశాలగా తీర్చిదిద్దారన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయుడు రామకృష్ణ సతీమణి లక్ష్మీకి పూర్వ విద్యార్థులు రామకృష్ణ జీవిత చరిత్రను కావ్య రూపంలో రచించి సంస్మరణ పత్రాన్ని, మెమొంట్‌ను అందించారు. ఆయన పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పూర్వ విద్యార్థులు అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజు, గిరిబాబు, బిక్షం, భాస్కర్, కృష్ణారావు పాల్గొన్నారు.




సంస్మరణ పత్రాన్ని ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



## లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలి: ఎస్ఐ రమేష్



ఎర్రుపాలెం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల14న మధిరలో జరిగే నేషనల్ లోక్‌అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎర్రుపాలెం ఎస్ఐ రమేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్9 నుంచి 14వరకు యాక్సిండెంట్, గొడవలు, చీటింగ్, చిట్‌ఫండ్, భూ తగాదాలు, వివాహబంధం, దొంగతనం తదితర కేసులకు సంబంధించి ఇరుపార్టీలు కోర్టుకు హాజరుకావాలని తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్నకేసులు సామరస్యంగా పరిష్కరించుకోవడానికి ఫిర్యాదుదారులు, నేరస్తులు తమ ఆధార్‌కార్డ్‌లతో హాజరుకావాన్నారు. పూర్తి వివరాలకు 8712659164, 9441877650 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

## బీజేపీ మతోన్మాద చర్యలను ఖండించాలి

పెనుబల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ హిందుత్వ ఎజెండాను తెస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు గాలి వెంకటాద్రి విమర్శించారు. సోమవారం రెండోరోజు జరిగిన రాజకీయ శిక్షణ తరగతులలో పార్టీ కర్తవ్యాలు, ముందున్న బాధ్యతలు అనే అంశంపై బోధించారు. మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, డివిజన్ కమిటీ సభ్యురాలు మిట్టపల్లి నాగమణి, చమట విశ్వనాథ్, నలమల అరుణప్రతాప్, తాండ్ర రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొణిజర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటి పరిధిలోని శాంతినగర్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని లారీ ఢీ కొట్టగా వ్యక్తికి తీవ్రగాయాలు అయిన సంఘటన సోమవారం జరిగింది. మండల పరిధిలోని సిద్దిక్‌నగర్ గ్రామానికి చెందిన మోట వీరబాబు ద్విచక్రవాహనంపై వైరా వెళ్లుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రమాదపుటంచున ప్రయాణాలు

- జాతీయ రహదారిపై అడుగడుగునా పొంచి ఉన్న ప్రమాదం
- గాలిదుమారానికి విరిగిపడిన చెట్లను తొలగించడంలో హైవే అధికారుల నిర్లక్ష్యం

వైరా, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వైరా-తల్లాడ మధ్యలో జాతీయ ప్రధాన రహదారిపై అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. గతనెలలో వచ్చిన భారీ ఈదురుగాలులకు జాతీయ ప్రధాన రహదారిపై అనేక చోట్ల చెట్లు కూలడంతో కొమ్మలు విరిగిపోయి రోడ్డుపైకి



స్టేజీ పినపాక వద్ద చెట్టు కొమ్మలు విరిగి రోడ్డుపై వేలాడుతున్న దృశ్యం



డాన్‌బోస్కో స్కూల్ సమీపంలో రోడ్డుపై విరిగినపడిన చెట్లకొమ్మలు

చొచ్చుకొని వచ్చి ప్రమాదకరంగా ఉన్నాయి. నెలరోజులు దాటినప్పటికీ కూలిన చెట్లను, విరిగిపోయి రోడ్డుపైన వేలాడపడుతున్న కొమ్మలను తొలగించే విషయంలో నేషనల్ హైవే అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. భారీ గాలిదుమారానికి నేషనల్ హైవే పక్కనున్న చెట్లు కూలడంతో హైవేపై గంటలతరబడి ట్రాఫిక్ ఏర్పడింది. వైరా, తల్లాడ పోలీసులు రోడ్డుపై పడిన చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. ప్రతి నిత్యం జిల్లాకు చెందిన అమాత్యులు అలాగే రెండు జిల్లాల ఉన్నతాధికారులు ఈ ప్రమాదకరంగా హైవేపైకి వాలిపోయిన చెట్ల కొమ్మల మధ్య నుంచే రాకపోకలు కొనసాగిస్తూ కనీసం వారు కూడా నేషనల్ హైవే అధికారులపై ఎలాంటి వత్తిళ్లు తీసుకురావడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. జాతీయ ప్రధాన రహదారిలో వైరా నదిపై ఉన్న హైలెవల్ వంతెన దాటిన తర్వాత తల్లాడ వైపు రోడ్డు పక్కనున్న ఒక భారీ చెట్టు మొదళ్లతో సహా పూర్తిగా కూలిపోయింది. ఆ చెట్టు కొమ్మలు రోడ్డుపైకి చొచ్చుకొని వచ్చాయి. ఆ కొమ్మల కింద నుంచే భారీ వాహనాలు, కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. కూలిన చెట్టుకు సమీపంలోనే మరో చెట్టు కొమ్మలు విరిగిపోయి రోడ్డుపైకి చొచ్చుకొని వచ్చాయి. స్టేజీ పినపాక సమీపంలో పెట్రోల్ బంకుల వద్ద ఒక తుమ్మచెట్టు కొమ్మ పూర్తిగా విరిగిపోయి నడిరోడ్డుపై వేలాడపడి ఉంది. అది ఎప్పుడు ఎవరిపై పడుతుందో, ఎలాంటి నష్టం జరుగుతుందో తెలియని ప్రమాదకర పరిస్థితి ఉంది. ఇకపోతే డాన్‌బోస్కో స్కూల్‌కు ఎదురుగా విరిగిన చెట్టు కొమ్మలు మొత్తం రోడ్డుపైకి చొచ్చుకొని వచ్చాయి. ఈ రోడ్డు ఒకవైపు సగం వరకు ఈ కొమ్మలు చొచ్చుకొని వచ్చి అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. అయినప్పటికీ నేషనల్ హైవే అధికారులు తమకేమీ పట్టనట్లు, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యాన్ని వీడి ప్రమాదకర చెట్లను, కొమ్మలను తొలగించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు దుస్తుల పంపిణీ



దుస్తులను పంపిణీ చేస్తున్న ఎంఈవో జయరాజ్

కారేపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం ఉచితంగా దుస్తువుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే కుట్టించిన దుస్తులను అందజేశారు. మండల పరిధిలోని స్వయంసహాయ సంఘాలతో ముందుగానే ఈ దుస్తులను కుట్టించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి డి.జయరాజ్ మాట్లాడుతూ.. ముందుగానే ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అవసరమైన క్లాత్‌ను తెప్పించి, ఇందిర క్రాంతి పథకంలో భాగంగా స్వయంసహాయక సంఘాలతో గ్రామాల్లో కుట్టించడం జరిగిందన్నారు. విద్యార్థుల సంఖ్యనుబట్టి ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు సోమవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, కేజీబీవీ ఎస్ఓ ఝాన్సీ సౌజన్య, పలువురు సీఆర్పీలు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

వేంసూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెంకటాపురం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్.సరితను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో రాజారావు తెలిపారు. ఇటీవల నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో పదివేలకు మించి ఫైన్ ఉండడంతో ఆమెను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శి సోనాలికి నివాళి




సోనాలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సహద్యోగులు

తల్లాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో భాగంగా రోడ్డు ప్రమాదానికి గురై అకాల మరణం చెందిన పెనుబల్లి మండల రామచంద్రాపురం బంజర పంచాయతీ కార్యదర్శి సోనాలికి మండలపరిషత్ ఉద్యోగులు, కార్యదర్శులు నివళులర్పించారు. సోమవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోనాలి చిత్రపటానికి ఎంపీడీవో సురేష్‌బాబు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అందరూ మౌనం పాటించారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి

సత్తుపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందుతున్నాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సోమవారం ఆమె సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. దశాబ్ద కాలంగా పేదలు పక్కా గృహాల కోసం ఎదురుచూసారని, గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి హామీ ఇచ్చినందున పేదలకు ఇళ్లు మంజూరు చేసిందని, అందులో భాగంగా సత్తుపల్లి నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరయ్యాయని, రాబోయే రోజుల్లో పేదలందరికీ ఇళ్లు మంజూరు అవుతాయన్నారు.



ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఇదే వార్డులలో జై బాపు.. జైభీమ్.. జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వ పథకాలను పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ తోట సుజలారాణి, నాయకులు నరసింహారావు, కమల్‌పాషా, పింగిలి సామేలు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట

- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

బోనకల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాటే మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎస్ఆర్ కళ్యాణ మండపంలో సోమవారం నియోజకవర్గ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరునోముల నుంచి బోనకల్ వరకు కార్యకర్తలు, నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కవిత లేఖ అంశం డ్రామాగా అభివర్ణించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్‌తో ఎన్నికల ఫ్రంట్ ఉండదని, కేవలం అవగాహన మాత్రమే ఉంటుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఒకే తానులో గుడ్డలని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా కలిసొచ్చే లౌకిక శక్తులతో పని చేస్తామన్నారు. ఎన్నికల ముందు ఇష్టారాజ్యంగా హామీలిచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేసే పరిస్థితి లేక నానా తంటాలు పడుతోందని తెలిపారు. అమెరికాలో ఆర్థిక సంక్షోభం కొనసాగడం వల్ల కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు పడిపోతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వైఫల్యం వలన పహల్గాం ఘటనలో 26 మంది మృతి చెందారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, పొన్నం వెంకటేశ్వరరావు, కిలారు సురేష్, బట్టు పురుషోత్తం, రాజపంటి రాము, మందా సైదులు, మురళి, పాపినేని రామనర్సయ్య, శీలం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

## రాహుల్‌గాంధీని పీఎం చేయడమే లక్ష్యం

- వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్

వైరా, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో నరేంద్రమోదీకి బుద్ధి చెప్పి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయటానికి ప్రతి ఒక్క కార్యకర్త కంకణబద్ధులై పనిచేయాలని, ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త అంతిమ లక్ష్యం అదేనని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని గొల్లపూడి, గన్నవరం, ఖానాపురం, కొండకొడిమ, రెబ్బవరం తాటిపడి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సభలు నిర్వహించి పార్టీ గ్రామకమిటీ అధ్యక్షులు, కార్యవర్గాలను సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కాంగ్రెస్ నిర్మాణ కమిటీ సభల్లో జైబాపూ.. జైభీమ్.. జైసంవిధాన్ అభియాన్ పాదయాత్రలో పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నాయకులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, నాయకులు దొడ్డా పుల్లయ్య, మచ్చా బుజ్జీ, బీడీకే రత్నం, బొళ్ల గంగారావు, పమ్మి అశోక్, పాలేటి నర్సింహారావు, శ్రీరామనేని తిరుపతిరావు, యన్నం వెంకటకోటారెడ్డి, మేడూరి రామారావు, షేక్. సైదా, రఫీ, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



గ్రామకమిటీ అధ్యక్ష ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

## డ్రైయినేజీ మురుగు తొలగింపు




మురుగు తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ వేణు

వైరా, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ 14వ వార్డు పరిధిలోని జాతీయ ప్రధాన రహదారి పక్కనున్న డ్రైయినేజీలో కొన్ని సంవత్సరాల తరబడి పేరుకుపోయిన మురుగునీటిని సోమవారం మునిసిపల్ సిబ్బంది తొలగించారు. మురుగులో వైరా మునిసిపాలిటీ అనే శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కమిషనర్ చింతా వేణు స్పందించారు. దానిలో భాగంగా సోమవారం మునిసిపాలిటీ పారిశుధ్య కార్మికులు ఎక్స్‌కవేటర్ ఇతర వాహనాల సహాయంతో డ్రైయినేజీలో నిల్వ ఉన్న మురుగు నీటిని తోడి బయటకు పంపించారు. కొన్ని సంవత్సరాల నుంచి ఈ డ్రైయినేజీలో మురుగునీరు పేరుకుపోయి అక్కడి నివాసాల వారు తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే విషయాన్ని ఆంధ్రజ్యోతి వివిధ ప్రాంతాల్లోని మురుగునీటితోపాటు వెలుగులోకి తెచ్చింది. తక్షణమే 14వ వార్డు పరిధిలోనిమురుగును తొలగించారు.

## భట్టి మాట బేఖాతరు

- వాన నీరు మళ్లింపు చర్యలు చేపట్టని అధికారులు

చింతకాని, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని స్వయాన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి ఆదేశాలు జారీచేసినా అధికారులు భట్టి మాటలను పెడచెవిన పెట్టారు. ఇటీవల మండల పర్యటనకు వచ్చిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాన్వాయ్‌ను కొదుమూరులో గ్రామస్థులు నిలిపారు. రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ఇబ్బందిగా ఉందని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, వాహనదారులు బురద నీటి వల్ల ఇబ్బందులు పడుతున్నారని భట్టి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే భట్టి ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్ చేసి నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఘటన జరిగి నెల రోజులు కావస్తున్న నేటికి అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం.



కొదుమూరులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

## కల్తీ ఎరువులను అరికట్టాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌కే.ఉమర్

సత్తుపల్లి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కల్తీ ఎరువులు, పురుగు మందులను అరికట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్కే ఉమర్ డిమాండ్ చేశారు. సత్తుపల్లి తహసీల్దార్‌కు ఈ మేరకు సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. వ్యవసాయ సీజన్ ప్రారంభం నుంచి కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను గ్రామాల్లో తిరుగుతూ విక్రయిస్తున్నారని అన్నారు. కల్తీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయిన సంఘటనలు ఉన్నాయని అన్నారు. కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.సత్యనారాయణ, మారుతి రాఘవులు, పామర్తి లక్ష్మయ్య, సయ్యద్ గౌసు‌లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అవగాహన

కారేపల్లి జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఇందిరమ్మఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు సోమవారం మండల పరిధిలోని అప్పాయిగూడెంలోని రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సురేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏలా నిర్మించుకోవాలి, 400చదరపు అడుగులకు తక్కువకాకుండా, 600చదరపు అడుగులకు మించకుండా ఇండ్లు నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ఇనుము, సిమెంట్ వాడకం వంటి వాటిపై పూర్తిస్థాయిలో అవగాహనకల్పించారు. కార్యక్రమంలో మండల పంచాయితీ అధికారి రవీంద్రప్రసాద్, హోసింగ్ ఏఈ నాగేందర్, ఏపీఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు వినతి

వైరా, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యలు, అభివృద్ధి పనుల గురించి సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు ప్రిన్సిపల్ ఎల్.నవీనజ్యోతి ఒక వినతిపత్రం సమర్పించారు. అసంపూర్తిగా ఉన్న రెండు తరగతి గదులు అలాగే మరుగుదొడ్లు నిర్మించాలని ఆ వినతిపత్రంలో కోరారు. కొన్నినెలల కిందట కలెక్టర్ వైరా కాలేజీని సందర్శించిన సమయంలో సమస్యల పరిష్కారానికి ఆయన ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. కలెక్టర్ హామీ మేరకు ఖాళీ స్థలం నుంచి వెళ్తున్న కరెంట్ తీగలను విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కలెక్టర్ ఆదేశాలతో ట్రాన్స్‌కో అధికారులు మార్చారని తెలిపారు. మిగిలి సమస్యలు పరిష్కారం కాలేదని వెంటనే వాటిని పరిష్కరించారని ఆ వినతి పత్రంలో కోరారు.

## సర్కారు బడుల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

బోనకల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంఈవో దామాల పుల్లయ్య సూచించారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు పెంచడం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ, ప్రచార జాత కార్యక్రమాన్ని




ప్రచార జాతను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈవో దామాల పుల్లయ్య

సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన బోధన అందుతుందని తెలిపారు. ఉచితంగా నోట్‌పుస్తకాలు, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాలల బలోపేతం కోసం సమాజ భాగస్వామ్యం ఎంతగానో అవసరమన్నారు. తల్లిదండ్రులు సహకరించి పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, జి. రంగారావు, సదా బాబు, కోటయ్య, గోపాలరావు, నర్సింహారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం గార్లొడ్డు గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.హెచ్‌ఎం కూరాకుల సైదయ్య ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బడిఈడు పిల్లలందరని కలిశారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్‌ఎం మాదవి, ఉపాధ్యాయులు రాఘవరావు, శంకరరావు, చంద్రప్రకాష్, వర్జీనియా, కస్తూరి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

## మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం




సైకిల్ యాత్రలో మాట్లాడుతున్న ఎస్ఐ రామారావు

వైరా, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతను చైతన్యం చేస్తూ జిల్లా వ్యాప్తంగా డీవైఎఫ్ఐ చేపట్టిన యువచైతన్య యాత్ర అభినందనీయమని వైరా ఎస్ఐ పి.రామారావు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి వైరాలో నిర్వహించిన డీవైఎఫ్ఐ యువచైతన్య సైకిల్ యాత్రకు ఎస్ఐ సంఘీభావం తెలిపి ప్రసంగించారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా జిల్లావ్యాప్తంగా డీవైఎఫ్ఐ చేస్తున్న సైకిల్ యాత్రను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు చాలామంది యువత బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో వాటికి వ్యతిరేకంగా డీవైఎఫ్ఐ చేస్తున్న సైకిల్ యాత్ర బృందాన్ని ఆయన అభినందించారు. సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, డీవైఎఫ్ఐ నాయకులు షేక్. బషీరుద్దీన్, షేక్.నాగూల్‌పాషా, మద్దాల ప్రభాకర్, చింతల రమేష్, శీలం వీరబాబు, సత్తెనపల్లి నరేష్, గుమ్మా ముత్తారావు పాల్గొన్నారు.

## భూ భారతి సదస్సులను సద్వినియోగించుకోవాలి

వేంసూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): భూ భారతి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మాణిక్యరావు సూచించారు. మండలంలోని కందుకూరు, అడసర్లపాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సులో 246దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీటీ బన్సీరామ్, ఆర్‌ఐలు శ్రీనివాస్, జార్జి, సిబ్బంది మహేష్, గోపాలకృష్ణ, బేబీ, లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ముదిగొండ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ సూచించారు. సోమవారం చిరుమర్రి, సువర్ణాపురం గ్రామపంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు తమ భూ సమస్యల పరిష్కారానికి ఈ రెవెన్యూ సదస్సులే మర్గామన్నారు. రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. నాయబ్ తహసీల్దార్ లక్ష్మీ, ఆర్‌ఐలు వహీదా, ప్రసన్నకుమార్, సీనియర్ అసిస్టెంట్ రవీందర్, జూనియర్ అసిస్టెంట్లు రమాదేవి, నాగూల్‌మీరా, జాన్‌మియా పాల్గొన్నారు.



అడసర్లపాడులో దరఖాస్తులు స్వీకరిస్తున్న డీటీ బన్సీరామ్

### హెల్ప్ డెస్క్ ప్రారంభం



తల్లాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తల్లాడ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం భూ భారతి హెల్ప్‌డెస్క్‌ను తహసీల్దార్ సురేష్‌కుమార్ ప్రారంభించారు. గ్రామసభలు జరిగినప్పుడు దరఖాస్తు చేయని రైతులు హెల్ప్‌డెస్క్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. హెల్ప్‌డెస్క్ ఇన్‌చార్జిగా జూనియర్ అసిస్టెంట్ షేక్ అజిత్‌ను నియమించినట్టు తెలిపారు.

## ప్రభుత్వ బడుల్లో బాలలను చేర్పించాలి




పినపాకలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

తల్లాడ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి వారి సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈవో ఎస్.దామోదరప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని పినపాక గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలున్న ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి నరసింహారావు, ఉపాధ్యాయులు శీలం శ్రీనివాసరెడ్డి, పులి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.